ఈ - ఆఫీసులో ప్రత్యేక గుర్తింపు



● ఇద్దరు మంత్రుల పనితీరు భేష్
● కలెక్టర్.. జేసీలకు ప్రశంసలు

నంద్యాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) ఈ-ఆఫీసు పని తీరుపై బుధవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులు, వివిధ శాఖలకు చెందిన కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు వివిధ అంశాలపై వచ్చిన ఈ-ఆఫీసు ఫైల్ క్లియరెన్సుకు సంబంధించిన జాబితాను విడుదల చేశారు. ఇందులో జిల్లాలోని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌లకు ప్రత్యేక గుర్తింపు లభించింది.



గత ఐదు నెలల వ్యవధిలో(ఈ ఏడాది ఆగస్టు-15 నుంచి డిసెంబరు 15వ తేది వరకు) మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కలిపి ఈ ఆఫీస్‌లో వివిధ శాఖల పరంగా 1532 ఫైల్స్ రాగా.. 1512 ఫైల్స్‌ను పరిశీలించి పరిష్కరించారు. మిగిలిన 20 ఫైల్స్ పరంగా వివిధ కారణాలతో తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టారు. ఇప్పటి వరకు వచ్చిన ఫైల్స్ పరంగా.. సదరు మంత్రి అన్నింటిని పరిశీలించి పరిష్కారం చేయడానికి ఒక్కొక్క ఫైల్‌కి సుమారు 2 రోజుల 10 గంటలు సమయం పట్టినట్లు పేర్కొన్నారు. దీంతో సదరు మంత్రికి రాష్ట్రస్థాయిలో మూడో వరసలో ఉన్నట్లైంది.



రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఈ ఆఫీస్‌లో 1126 ఫైల్స్ రాగా.. 1091 ఫైల్స్‌ను పరిష్కారించారు. మిగిలిన 35 ఫైల్స్ వివిధ కారణాలతో తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టారు. ఒక్కో ఫైల్ పరిశీలించి పరిష్కారించడానికి మంత్రికి సుమారు 3 రోజుల వ్యవధి పట్టినట్లు పేర్కొన్నారు. మంత్రి రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచారు.



కలెక్టర్ రాజకుమారికి ఈ ఆఫీస్ పరంగా.. 1324 ఫైల్స్ రాగా.. ఒక్కొక్క ఫైల్ ను 22.14 గంటలు(సుమారు ఒక రోజులోపు) పరిశీలించి 1169 క్లియర్ చేశారు. మిగిలిన ఫైల్స్ త్వరలో పరిష్కారం కానున్నాయి. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్‌కు నాల్గవ స్థానం దక్కింది. కలెక్టర్ ఒక్కరోజులోనే ఈ-ఆఫీస్‌లో వచ్చిన ఫైల్స్‌ను క్లియర్ చేస్తున్నారని తెలుస్తోంది. కలెక్టర్ ఐదో స్థానంలో నిలిచారు.



గత మూడు నెలల వ్యవధిలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు 670 ఫైల్స్ రాగా.. 435 పరిష్కారించారు. ఒక్కో ఫైల్‌కు సుమారు 2 రోజుల 4:44 గంటల సమయం పట్టింది. ఒక్కో ఫైల్‌ను జేసీ రెండు రోజుల్లో పరిష్కారిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఆయన 13వ స్థానంలో నిలిచారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

గోస్పాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సాగునీటిని దృష్టిలో పెట్టుకుని రబీలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని గోస్పాడు, యాలూరు గ్రామాల్లో వరి పంటకోత ప్రయోగాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు ఎరువులు వాడాలని సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను వేసుకోవాలన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నష్టం కలుగుతుందని, అలా కాకుండా పొలంలోనే కలియదున్నితే భూమిలో నత్రజని, భాస్వరం, సూక్ష్మపోషకాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏవో స్వప్నిక, ఏఈవోలు రామకృష్ణ, శ్రీధర్, ఖాజావలి, తదితరులు ఉన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెట్టండి: ఎస్పీ



రికార్డును పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

గడివేముల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. గడివేముల పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, సీసీ టీఎన్ఎస్ పని తీరును, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వివరాలను, వాటి కేసుల స్థితిగతులను ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్‌తో డెవలప్‌మెంట్

● స్కిల్ హబ్ సెంటర్లలో యువతకు శిక్షణ
● యువత భవితకు పునాదులుగా స్కిల్ సెంటర్లు


స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

జిల్లాలో స్కిల్ హబ్ సెంటర్లు	=7
శిక్షణ పొందుతున్న అభ్యర్థులు	= 320 మంది
స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు	=18,
డిగ్రీ కళాశాలల్లో శిక్షణ పొందుతున్నవారు	=296 మంది
ఉద్యోగ మేళాలు	= 16
ఎంపికైన వారు	= 2581మంది

నంద్యాల టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్కిల్ హబ్ సెంటర్లతో యువత ప్రగతి బాట పట్టనున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉన్నత విద్యాభ్యాసం చేయలేక ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీతో చదువు ఆపేసిన వారికి కొద్దిపాటి శిక్షణ నిచ్చి ఉద్యోగాలకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్) ఏర్పాటు చేశారు. ఉచితంగా శిక్షణ పొందే అవకాశం కల్పించడం కాకుండా వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తుండడం యువతకు ఇది మంచి అవకాశం.

ప్రస్తుతం ఆరు కేంద్రాలు

నంద్యాల జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఆరు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, డోన్‌లో రెండు, నందికొట్కూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో ఒక్కో సెంటర్‌లో మూడు నెలలకు 30మంది చొప్పున బ్యాచ్‌ను తయారు చేస్తున్నారు. చాలా మంది యువత ఉద్యోగాలు పొంది సంతోషంగా ఉన్నారు.

ఆసక్తి ఉన్నవారు వినియోగించుకోండి



పరిశ్రమల అవసరాలను బట్టి యువతకు ఆయా కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నాం. ఏరంగంపై ఆసక్తి ఉందో గుర్తించి వారికి అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

● శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, నంద్యాల

స్కిల్ హబ్‌లో శిక్షణ పొందొచ్చు

పదో తరగతి పూర్తయిన అనంతరం ఇంటర్ గానీ డిప్లొమా కానీ చేసినవాళ్లు డిగ్రీ బీటెక్ కోర్సులు మధ్యలో ఆపేసినవారు ఇక్కడ స్కిల్ హబ్‌లో శిక్షణ పొందవచ్చు. బేసిక్ కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రమైన నంద్యాలతో కలిపి ఆరు సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో యువత ఉచితంగా శిక్షణ తీసుకోవచ్చు. ప్రస్తుతం డిగ్రీ చదువుతూనే పట్టు పెంచుకునే విధంగా డిగ్రీ కళాశాలల్లో ఉపాధి నైపుణ్య కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

చేరడం ఎలా?

జిల్లాకు చెందిన విద్యార్థులు ఎవరైన ఆయా కేంద్రాల పరిధిలో శిక్షణ పొందొచ్చు. నైపుణ్య పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ఏ నైపుణ్యంలో ఏకోర్సులు అందుబాటులో ఉన్నాయి. కొత బ్యాచ్ ఎప్పుడు ప్రారంభమవుతుంది. తెలుసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుంది.


నంద్యాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయం

పీపీపీతో వైద్య విద్య దూరం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకొచ్చిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పీపీపీ విధానాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసం నుంచి భీమాస్ హోటల్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని 7 నియోజకవర్గాలలో ప్రజలు పీపీపీ విధానాన్ని నిరసిస్తూ 60 వేల సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా పాల్గొన్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

● జిల్లాలో 35 మంది గైర్హాజరు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈపరీక్షకు బుధవారం 35 మంది గైర్హాజరయ్యారు. మొదటిరోజు ఉదయం సెషన్‌లో మాత్రమే తెలుగు పరీక్షను నిర్వహించారు. 410మంది అభ్యర్థులు హాజరుకావాల్సి వుండగా 375 మంది హాజర య్యారు. నాలుగు సెంటర్ల వద్ద గట్టి బందోబస్తు మధ్య మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పరీక్షలను నిర్వహించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుధాకర్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి రామసుబ్బయ్య పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

టెట్ నుంచి మినహాయించాలి

● యూటీఎఫ్ నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలంటూ బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నంద్యాల బొమ్మలసత్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయూనియన్ నాయకుడు ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆప్షనల్ సెలవులు, స్థానిక సెలవులు వాడుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12నెలల జీతం ఇవ్వాలని, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 83 లక్షలు

కౌతాళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను కాలక్షేపపు మండపంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వాణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన 32 రోజుల కానుకలను బుధవారం లెక్కించగా రూ.83,71,517 నగదు, 55 గ్రాముల బంగారం, 9.810 కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్ రెడ్డి ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి పాల్గొన్నారు.

కేంద్రంలో దున్నపోతు పాలన

● రైతులను ఆదుకోవడంలో విఫలం
● గ్రామాల్లో తీరని నీటి సమస్య
● రైతు సమస్యల నిరసనలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఆస్పరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రజా సమస్యలు పట్టించుకోని దున్నపోతు పాలన నడుస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బుధవారం ఆస్పరిలో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అధ్యక్షతన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. గ్రామాల్లోని నీటి సమస్యలు కేంద్రం చెవికి ఎక్కడం లేదని ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో అధికంగా పండించే పత్తి, టమోటా, ఉల్లి, మిర్చి పంటలకు, ఇతర జిల్లాల్లో పండించే మామిడి, సపోటా, అరటి, దానిమ్మ పంటలకు గిట్టుబు ధరలు కల్పించలేదని విమర్శించారు. వేదవతి, గుండ్రేవుల, హంద్రీ నీవా పెండింగ్‌లో ప్రాజెక్టులను పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు లెనిన్‌బాబు, రాజాసాహెబ్, మద్దిలేటి, కౌలు రైతుల జిల్లా సంఘం అధ్యక్షుడు తిమ్మయ్య, నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టారు.

మరింత మెరుగ్గా పని చేయండి

కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా మరింత మెరుగ్గా పని చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజల సంతృప్తి స్థాయిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వమందిస్తున్న సేవలపై ప్రజలలో నిజమైన అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఐవీఆర్ఎస్, వాట్సాప్ గవర్నర్స్, క్యూ ఆర్ కోడ్ వంటి మూడు విభిన్న మాధ్యమాల ద్వారా ఫీడ్ బ్యాక్ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో రామునాయక్, సర్వే ఏడీ రామ్మోహన్, పీజీఆర్ఎస్ ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, భూమి ఆరోగ్య సంరక్షణ, ప్రకృతి వనరుల సుస్థిర వినియోగం మొదలైన వాటిపై ధర్తీ మాత బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆమె అధ్యక్షతన ధర్తీ మాత బచావో అభియాన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

విభిన్న ప్రతిభావంతులు రాణించాలి

విభిన్న ప్రతిభావంతులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. సాధారణ ప్రజానీకం- విభిన్న ప్రతిభావంతులు అనే తారతమ్యం లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమాన అవకాశాలతో ఎదగాలన్నారు.

ప్రజల ఆకాంక్షను గౌరవించాలి 8

సంకల్ప ఫలించేనా..?

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- 15 నుంచి ప్రీ ఫైనల్స్
- ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు
- కర్నూలు జిల్లాలో మొత్తం 167 కళాశాలలు
- 48,688 మంది విద్యార్థులు



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 50రోజులతో సంకల్ప షెడ్యూల్‌ను ప్రకటించింది. దీనిని పకడ్బందీగా అమలు చేసేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా అధికారులను, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ముఖ్యమైన ప్రశ్నాపత్రాలను పంపిణీ చేసి వాటిని ప్రిపేర్ చేస్తున్నారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 15వ తేదీ నాటికి సిలబస్‌ను పూర్తిచేసి ఉదయం పూట ప్రత్యేక తరగతులను విద్యార్థులకు బోధించాలని సూచించారు. డిసెంబరు 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 24వ తేదీ వరకు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి స్లిప్, వీక్లీ టెస్టులు నిర్వహించి విద్యార్థులకు నేర్పిస్తారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించారు. యావరేజీ, ఫెయిలయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి పాసయ్యేలా అధ్యాపకులకు విద్యార్థులను దత్తత చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యకు పెద్ద పీట..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తర్వాత ఇంటర్మీడియట్ విద్యకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పెద్ద పీట వేశారు. గతంలో ఎప్పుడూ లేని విదంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, పూర్తి స్థాయిలో అధ్యాపక బృందాన్ని నియమించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని, అందుకు తగ్గట్లుగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ రంజిత్ బాషా సూచించారు.

9వేల మంది పేద విద్యార్థులు

కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలు 167 ఉన్నాయి. ఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం కలిపి 48,668 మంది విద్యార్థులు విద్యను చదువుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23 ఉన్నాయి. ఈ కళాశాలలో 9 వేల మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు.



ప్రత్యేక ప్రణాళిక



జిల్లాలో ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక తీసుకున్నారు. సంకల్ప షెడ్యూల్‌ను బోర్డు అధికారులు ప్రకటించారు. ఈసంకల్ప షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు సంబంధించి సిలబస్‌ను పూర్తిచేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, స్లిప్ టెస్టులు, వీక్లి టెస్టులు నిర్వహించి రివిజన్ చేస్తున్నాం.

● సురేష్‌బాబు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ (డీఐవో), కర్నూలు

పరీక్షలకు సంసిద్ధం చేస్తూ..



ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబరు 15నుంచి 20వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు కొనసాగుతాయి. ఇప్పటికే విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్లిప్ టెస్టులు, వీక్లీ టెస్టులు నిర్వహిస్తున్నారు. కొన్ని కళాశాలలో ప్రత్యేక తరగతులు జరగడం లేదని తెలుస్తుంది. 2026 జనవరి 21న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదేనెల 23న పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుంది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలు ఒకేషనల్ కోర్సులో మూడు విడతలగానూ, జనరల్ కోర్సులో రెండు విడతలుగానూ నిర్వహించేందుకు ఇంటర్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు 9,044 మంది కాగా, బైపీసీ విద్యార్థులు 1493 మంది ఉన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

ఇంటర్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. 2026 సంవత్సరం ఫిబ్రవరి 23న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 24న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతాయి. ఈపరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. ఈసారి ఇంటర్‌బోర్డు అధికారులు పరీక్షకు మరలా పరీక్షకు మధ్య గ్యాప్ పరీక్షల షెడ్యూల్ నిర్ణయించారు. దీంతో విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి
- హాస్టళ్ల విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ



హాస్టల్ బాలికలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ హాస్టల్‌లో చదువుతున్న బాలికలకు సొంత నిధులు వెచ్చించి దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ప్రభుత్వ హాస్టల్‌లోని 1000మంది బాలికలకు ఉచితంగా దుప్పట్లను అందజేశామన్నారు. సొంత నిధులు రూ.3.50లక్షల విలువ చేసే దుప్పట్లను పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. ఈసందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ 6నుంచి డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న హాస్టల్ విద్యార్థినులకు నాణ్యమైన దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. బాలికలు క్రమశిక్షణ కలిగి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థికి జ్ఞానంతోపాటు లోకజ్ఞానం ముఖ్యమన్నారు. చదువు జ్ఞానాన్ని నేర్పిస్తే సమాజం లోకజ్ఞానాన్ని నేర్పిస్తుందన్నారు. పుస్తక పఠనం, దినపత్రికలు చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందన్నారు. బాలికలు చదువుల్లో బాగా రాణిస్తున్నారన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్‌పై దాడి చేసింది మహిళా సైనికులే అని కొనియాడారు. ఈసందర్భంగా గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, కవి ఇనాయతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన పాటలు, గీతాలు పలువురిని అలరించాయి. పేదలకు బీసీ రాజారెడ్డి అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సొసైటీ చైర్మన్ అత్తార్ అబ్దుల్ కలాం, జ్యోతిష్య పండితులు వెంకటరమణశాస్త్రి, మౌళీశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ డా.ఏ. సిరి అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఇందులో మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు, విద్య, మున్సిపల్, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ తదితర శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నవంబరు 27 నుంచి వచ్చే ఏడాది మార్చి 8వ తేదీ వరకు వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో బాల్య వివాహాల నివారణ చైతన్యం పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా, ఐసీడీఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- విజేతలకు బహుమతులు ప్రదానం
- ముగిసిన పిల్లల పండుగ



బాలోత్సవం కార్యక్రమం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన ఐదో కర్నూలు బాలోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనం, కథ చెప్పడం, తెలుగులో మాట్లాడటం, కార్టూన్ వేయడం, రైమ్స్ చెప్పడం, జానపద నృత్యాలు, కోలాటాలు, సంగీత వాయిద్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. సాయంత్రం బాలోత్సవం అధ్యక్షుడు జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో అమరావతి బాలోత్సవం నాయకురాలు స్వరూపారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషితోనే బాలోత్సవం విజయవంతమైందన్నారు. బాలోత్సవం గౌరవాధ్యక్షుడు జి. పుల్లయ్య మాట్లాడుతూ బాలోత్సవం వల్ల పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ విజేతలకు, పిల్లలను కష్టపడి తీసుకువచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా. అక్తర్ భాను, ప్రైవేటు విద్యాసంస్థల గౌరవాధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల సీఈవో విల్సన్, యునైటెడ్ ఇన్సూరెన్స్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి. నాగార్జున రెడ్డి, ఆర్థికవేత్త మన్సూర్ రెహిమాన్, వైద్యులు రాయపు రామచంద్రారెడ్డి, రామగోపాల్ రావు, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను గౌరవించాలి

- ఆదోని జిల్లా పశ్చిమ ప్రాంత సెంటిమెంట్
- మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్ అనగాని సత్యప్రసాద్‌కు తేల్చి చెప్పిన నేతలు
- మంత్రితో తిక్కారెడ్డి, డా. పార్థసారథి, మీనాక్షినాయుడు సమావేశం
- జిల్లా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘ చర్చ
- ఆదోని బంద్ సూపర్ సక్సెస్

కర్నూలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని పశ్చిమ ప్రాంతం నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష.. సెంటిమెంట్ ఆదోని జిల్లా. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి. కరువు ప్రాంత ప్రజలకు పాలనసౌలభ్యం.. అభివృద్ధికి బాటలు వేయాలని ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఏకరువు పెట్టారు. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు నియమించిన మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్, రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో వారు భేటీ అయ్యారు. ఆదోని రెవెన్యూ డివిజన్ ఒకప్పుడు బళ్లారి జిల్లాలో ఉండేదని, బాషా సంయుక్త రాష్ట్రాల విభజనలో భాగంగా 1952లో కర్నూలు జిల్లాలో కలిసిందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఆ సమయంలోనే ఆదోనిని జిల్లాగా చేయాలని డిమాండ్ బలంగా ఉండేదని వివరించారు. ఆదోని నిత్యం కరువు, వలసలతో సతమతమవుతున్న ప్రాంతం అని.. జిల్లా కేంద్రమైన కర్నూలుకు సమస్యలపై వెళ్లాలంటే 75 నుంచి 150 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, ప్రజలకు సౌలభ్యంగా లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన కోసం మం త్రివర్గ ఉప సంఘం వేయడంతో ఆదోని జిల్లా ఏర్పాటుచేయాలనే డిమాండ్ ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని, అది ప్రజలకు సెంటిమెంటుగా మారిందని వివరించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఆదోని జిల్లా లేకపోవడంతో ఒక్కసారిగా ప్రజాగ్రహం ఉప్పొంగి.. ఉద్యమాలు, ఆందోళనలకు బీజం పడిందని, నిరసనల వేగం పుంజుకుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



సీఎంతో చర్చిస్తాం

జిల్లాల పునర్విభజన కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం వేసింది. నాలుగు నెలలు గడి చింది. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు మంత్రి వర్గ ఉప సంఘాన్ని కలిసి ఎందుకు నివేదిక ఇవ్వలేకపోయారంటూ జిల్లా నాయకులను మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పటికైనా సమగ్ర వివరాలతో సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని వివరిం, చినట్లు తెలిసింది. జనవరి 1వ తేదీ నుంచి జనగణనకు శ్రీకారం చుడుతుండటతో ఈ సమయంలో జిల్లాల పునర్విభజన ఎంతవరకు సాధ్యం.. ఆదోని జిల్లా ఏర్పాటుకోసం మరోసారి నోటిఫికేషన్ ఇవ్వడం ఎంతవరకు సాధ్యం. న్యాయపరంగా, సాంకేతికపరమైన చిక్కు లు ఉన్నాయా? తదితర అంశాలపై మంత్రులు సమీక్షించినట్లు తెలుస్తుంది.

ఉప్పొంగిన ప్రజా ఉద్యమం

ఆదోని జిల్లా ఏర్పాటు కోసం జిల్లా సాధన సమితి, జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆదోని బంద్ సంపూర్ణంగా ముగిసింది. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత ఆస్థాయిలో ప్రజలందరూ సమష్టిగా పార్టీలకతీతంగా జిల్లా సాధన కోసం రోడ్డెక్కడం ఇదే ప్రథమం. ఉదయమే జేఏసీ ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు ఆర్టీసీ బస్సులను రోడ్డెక్కకుండా ఆపేశారు. వ్యాపారులు, వివిధ వ్యాపార సంఘాలు, దుకాణాలను మూసివేసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఆదోని జిల్లా ఆకాంక్షతో ప్రజలు నిర్వహించిన బంద్ సంపూర్ణ విజయం కావడం కొసమెరుపు.

ఆ రోజు పట్టించుకోని వైసీపీ నేతలు

రాష్ట్ర విభజన తర్వాత 13జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టింది. 2022లో 13 జిల్లాలను 27 జిల్లాలుగా విభజించి పరిపాలనకు శ్రీకారం చుట్టింది. ఆరోజు ఆదోని జిల్లా ఏర్పాటు చేసేందుకు చక్కటి అవకాశం ఉంది. అప్పుడు కర్నూలు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీలతో పాటు 14మంది ఎమ్మెల్యేలు కూడా వైసీపీకి చెందిన వారే ఉన్నారు. ఆదోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి వైసీపీ ఎమ్మెల్యేలే ఎన్నికయ్యారు. ఆదోని జిల్లా చేయాలని పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి బాటలు వేయాలని ఏ ఒక్క వైసీపీ ఎమ్మెల్యే కూడా ఆరోజు అప్పటి సీఎం జగన్‌ను అడిగిన దాఖలాలు లేవని స్థానికులు అం టున్నారు. ఆ రోజే ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మిగిలిన ఎమ్మెల్యేలను కూడగట్టుకుని జగన్‌పై గట్టిగా ఒత్తిడి తెచ్చి ఉంటే జిల్లా ఏర్పాటు సాధ్యమయ్యేది. నాడు జగన్ భయపడ్డాడో.. జిల్లా అవసరం లేదనుకున్నారో.. వారికే తెలియాలి. నాడు పట్టించుకోని వైసీపీ నాయకులు ప్రస్తుతం ఆదోని జిల్లా కోసం గళమెత్తుతున్నారు. జిల్లా కావాలని అడగడంలో తప్పు లేదు.. ఆ రోజు ఎందుకు అడగలేదని, జిల్లా ఇవ్వని జగన్‌ను ఎందుకు నిలదీయలేదని.. అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రశ్నించకుండా రాజకీయ స్వలాభాపేక్షతో వైసీపీ నాయకులు జిల్లాను అడగడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నిస్తున్నారు. ఆదోని జిల్లా, నాలుగు మండలాల ఏర్పాటు అంశాన్ని అసెంబ్లీలో గళమెత్తినది కూటమి ఎమ్మెల్యే పార్థసారథే అన్నారని పలువురు పేర్కొంటున్నారు. అయినా రాజకీయ స్వలాభాలు పక్కనపెట్టి ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లా ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

కీలక విషయాలపై నివేదిక

- ముఖ్యమంత్రికి సమర్పించిన శ్రీశైలం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్
- విజిలెన్స్ విభాగం ఆవశ్యకత, డిజిటలైజేషన్ విధానాన్ని వివరించిన చైర్మన్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక అందజేస్తున్న రమేశ్ నాయుడు

శ్రీశైలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి తరహాలో శ్రీశైల క్షేత్రాభివృద్ధికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రిని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు సచివాలయంలో కలిశారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి క్షేత్ర పరిధిలో చేపట్టాల్సి కీలక విషయాల ప్రత్యేక నివేదికను సమర్పించారు. ప్రధానంగా క్షేత్రాభివృద్ధి కోసం, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమంచేందుకు క్షేత్ర పరిధినంతా డీఎస్పీ స్థాయి అధికారితో విజిలెన్స్ విభాగాన్ని తక్షణమే ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించినట్లు చైర్మన్ తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం ఆచరణలో ఉన్న ఆన్‌లైన్ సేవలతో పాటు ప్రతి సౌకర్యాన్ని డిజిటలైజేషన్ చేయడం వల్ల యాత్రికులు నేరుగా సేవలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగించే నిషేధిత అంశాలకు తావివ్వకుండా ఉండేందుకు నివాస గృహాలను సున్నిపెంటకు బదిలీ చేసే చర్యలను పారదర్శకంగా నిర్వర్తించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. టెంపుల్ టౌన్‌గా ప్రసిద్ధి చెందాల్సిన సున్నిపెంట గ్రామంలో కూడా మద్యం దుకాణాలను తరలించడం శ్రేయస్కరంగా భావిస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆలయ సంప్రదాయాలతో పాటు క్షేత్రాభివృద్ధికి పాటుపడుతున్న ధర్మకర్తల మండలి నిర్ణయాలను ముఖ్యమంత్రి అభినందించినట్లు చైర్మన్ చెప్పారు.

గర్జించిన ఆదోని

- జిల్లా కోసం బంద్ విజయవంతం
- స్వచ్ఛందంగా దుకాణాలు, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయాలు మూసివేత
- ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న జేఏసీ నాయకులు
- పాల్గొన్న వివిధ వర్గాల ప్రజలు, సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు



రోడ్డుపై బైఠాయించిన జేఏసీ, రాజకీయ పార్టీల నాయకులు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రజలంతా గర్జించారు. బుధవారం జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చిన బంద్ విజయవంతం అయింది. దుకాణాలు, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. తెల్లవారుజాము అయిదు గంటలకే జేఏసీ నాయకులు ఆర్టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కకుండా అక్కడే బైఠాయించారు. ఉదయం 9గంటలకు టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న నాయకులను తప్పుకోవాలని సూచించారు. తాము బందుకు పిలుపునిచ్చామని ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న నాయకులందరినీ బలవంతంగా తప్పించి రోడ్డెక్కించే ప్రయత్నం చేశారు. అరగంట పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసు సిబ్బంది చేత బలవంతంగా విచక్షణ రహితంగా కొందర్ని లాగి పక్కకు తోసేశారు. న్యాయవాది నాగేంద్రయ్య, సీపీఐ వీరేష్, తిరుమలేష్, ఉదయ్ దేవిశెట్టి ప్రకాష్, సుజ్ఞానమ్మ, నాగరాజుగౌడ్, కునిగిరి నీలకంఠ, రత్నాబాయి, వెంకటేష్, శ్రీనివాసాచారితో మరికొంత మంది రోడ్డుపై అడ్డంగా పడుకున్నారు. పోలీసులు బలవంతంగా కొన్ని బస్సులను రోడ్డెక్కించారు. ప్రజలు వారి ప్రయత్నాలను తిప్పి కొట్టి బస్సులను అడ్డుకున్నారు. జేఏసీ నాయకులతోపాటు తెలుగుదేశం, వైసీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ తోపాటు వామపక్ష పార్టీలు విద్యార్థి, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్స్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, కాటన్ మర్చంట్ అసోసియేషన్, షరాఫ్ బజార్, కుల సంఘాల నాయకులు కదం తొక్కారు. జేఏసీ నాయకులు రఘురామయ్య, అశోక్ నంద రెడ్డి, కృష్ణమూర్తి, లలిత, నూర్ అహ్మద్, కోదండ, దస్తగిరి, విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి, భూపాల్ చౌదరి, మరుతీ నాయుడు, సిద్ధార్థ నాయుడు, రంగస్వామి, జిందే శంకర్, అరేకల్ రామకృష్ణ, వెంకన్నగేరి మల్లికార్జున, బసాపురం రామస్వామి తదితరులు ఆర్టీసీ డిపో వద్దకు వచ్చి రోడ్డుపై బైఠాయించారు. వైసీపీ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చలపతి, రామలింగేశ్వర యాదవ్, బీజేపీ నాయకులు కునిగిరి నీలకంఠ, నాగరాజుగౌడ్, అదూరి విజయ్ కృష్ణ, వెల్లాల మధుసూదన్ శర్మ, జనసేన నాయకులు రెను వర్మ, పులిరాజు, రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, దిలీప్ శ్రీనిధి సాయినాథ్ అక్కడి నుంచి ర్యాలీగా వచ్చారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజవర్గాలను కలిపి ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.

దీక్షలో క్రైస్తవ పాస్టర్లు



స్వచ్ఛందంగా మూసివేసిన బంగారు దుకాణాలు

జిల్లా సాధన సమితి చేపట్టిన రిలే దీక్షలు 25వ రోజు ఆదోని క్రైస్తవ పాస్టర్లు ఆనంద్ రాజు ఎజ్రా శ్రీధర్, బెనర్జీ రాజు, థామస్, రవి, జదిద్య, అనిల్, విల్సన్, విజయ్ తోపాటు కొంత మంది దీక్షలో కూర్చున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమాస్ కూడలి దిగ్బంధం

ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలంటూ రోడ్లన్నీ మార్మోగాయి. పదేళ్ల చిన్నారి నుంచి 90 ఏళ్ల ముదుసలి వరకు ఒకటే నినాదంతో భీమాస్ నుంచి శ్రీనివాస భవన్, నిర్మల్ టాకీస్, రైల్వే స్టేషన్‌ను దిగ్బంధనం చేశారు. మున్సిపల్ క్రీడా మైదానం నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలతో ర్యాలీ చేపట్టారు.

టైర్లకు నిప్పు పెట్టి నినాదాలు

బీజేపీ నాయకులు భీమాస్ కూడలిలో టైర్లకు నిప్పు పెట్టి నినాదాలు చేశారు. వన్ టౌన్ సీఐ శ్రీరామ్ అక్కడ చేరుకొని నచ్చజెప్పి శాంతియుతంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలని సూచించారు.

సగమే సాగు

• రబీ ముగుస్తున్నా 41,078 హెక్టార్లే సాగు • ఖరీఫ్ నష్టాలతో ముందుకు సాగలేని రైతులు



ఓర్వకల్లు మండలంలో సాగు చేసిన శనగ

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రబీ సాగు విస్తీర్ణం 1,78,094 హెక్టార్లు కాగా.. రబీ ముగిసిపోతున్నా కూడా కేవలం 41,078 హెక్టార్లకే (38 శాతాని)కే పంటల సాగు పరిమితమైంది. ఇటువంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు తెలిపాయి. గత ఖరీఫ్‌లో వర్షాలు, తుపాన్లతో రైతులు భారీగా నష్టపోయారు. ఈ పరిస్థితి రబీ సీజన్‌లోనూ వెంటాడుతుందేమోనని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. దీంతో పాటు రబీలో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి బ్యాంకుల నుంచి అందకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. చేతికందిన పంటలకు నామమాత్రంగానే మద్దతు ధర లభిస్తుండటంతో ప్రధాన పంటల సాగు పై రైతులు ఆసక్తి చూపించలేదు. అక్టోబరు నుంచి మొదలైన రబీ సాగు ఇప్పటికీ దాదాపు పూర్తి కావాల్సి ఉంది. అయితే.. సగం కూడా సాగు కాని పరిస్థితి జిల్లాలో నెలకొంది. వరి సాగు సాధారణ విస్తీర్ణం 4,314 హెక్టార్లు కాగా, కేవలం 15 హెక్టార్లు మాత్రమే ఇప్పటికీ సాగైంది. అదే విధంగా జొన్న 9,790 హెక్టార్లకు గాను 2,468 హెక్టార్లు సాగైంది. సజ్జ 788 హెక్టార్లుకు గాను 48 హెక్టార్లు మాత్రమే సాగైంది. మొక్కజొన్న 6,558 హెక్టార్లుకు గాను 2,912 హెక్టార్లలో సాగైంది. శనగ 59,608 హెక్టార్లకు గాను 33,079 హెక్టార్లలో, వేరుశనగ 15,499 హెక్టార్లకు 860 హెక్టార్లలో సాగైంది. పొద్దుతిరుగుడు 376 హెక్టార్లకు రెండు హెక్టార్లలోనే సాగు చేశారు. ఆముదం 129 హెక్టార్లకు గాను ఇంత వరకు ఒక్క హెక్టారులో కూడా విత్తనం పడలేదు. పొగాకు 1,743 హెక్టార్లు సాగు చేయాల్సి ఉండగా.. కేవలం 1,314 హెక్టార్లకే పరిమితైంది. వాము 1,616 హెక్టార్లకు ఇంతవరకు ఒక హెక్టారులో కూడా విత్తనం వేయలేని పరిస్థితి నెలకొంది. మిరప 810 హెక్టార్లకు దారుణంగా 45 హెక్టార్లలో సాగు చేశారు. మొత్తం మీద రబీలో అన్ని పంటలు కేవలం 41,076 హెక్టార్లలోనే సాగు కావడం దారుణం.

కంది పంటకు ధర వస్తుందనే ఆశతో ...



కంది పంటకు కేంద్ర ప్రభుత్వం రూ.8వేల మద్దతు ధర ప్రకటించింది. దీంతో ఖరీఫ్‌లోనే ఈ పంట సాధారణ సాగు విస్తీర్ణం 69,530 హెక్టార్లు కాగా, ఖరీఫ్ నెలాఖరు నాటికి 1,11,757 హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కాయదశలో ఉంది. దీనివలనే శనగ సాగు తగ్గిందని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి రబీ సీజన్‌లో ప్రధాన పంటల సాగు తగ్గిపోవడంపై వ్యవసాయాధికారులు ఆందోళన చెందుతుందన్నారు.

మిగిలిపోయిన 110 క్వింటాళ్ల విత్తనం

ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ప్రధాన పంటలకు సంబంధించి రాయితీపై విత్తనాలు అందజేస్తుంది. అయితే.. ఈసారి రబీ సీజన్‌లో రాయితీ విత్తనాలను రైతులకు అందించేందుకు ఏపీ సీడ్స్ సంస్థ చర్యలు తీసుకున్నా రైతుల నుంచి పెద్దగా ఆసక్తి కనిపించలేదు. మార్కెట్‌లో లభించే ధరనే ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి విత్తనాలు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. జిల్లాలో రబీ సీజన్‌లో 22 మండలాల రైతులు శనగ పంటను సాగు చేస్తారు. వీరి కోసం ఏపీ సీడ్స్ సంస్థ 23,898 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించింది. ఈ రాయితీ విత్తనాలను 15 మండలాల్లోనే రైతులు తీసుకున్నారు. హొళగుంద, హాలహర్వి, ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, నందవరం, గోనెగండ్ల తదితర మండలాల్లో రైతులు ఎవరూ విత్తనం కోసం ఆసక్తి చూపలేదు. మొత్తం మీద లక్ష్యంలో సగం 12,786 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే రైతులు తీసుకున్నారు. 11,110 క్వింటాళ్ల విత్తనం మిగిలిపోయింది. నంద్యాల జిల్లాలో 24 మండలాలకు గాను 12,314 క్వింటాళ్ల రాయితీ విత్తనాలను కేటాయించారు. అయితే.. ఆళ్లగడ్డ, చాగలమర్రి, ప్యాపిలి తదితర మండలాల రైతులు విత్తనాలను తీసుకోలేదు. కేవలం 11,878 క్వింటాళ్ల విక్రయమే జరిగింది. కర్నూలు జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. శనగ పంట సాగు 59,608 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు కేవలం 34,027 హెక్టార్లలోనే సాగైంది. నంద్యాల జిల్లాలో 59,881 హెక్టార్లుకు గాను కేవలం 45,549 హెక్టార్లలోనే ఈ పంట సాగు కాడం గమనార్హం.

భార్య కాపురానికి రాలేదని..

• వ్యక్తి బలవన్మరణం

బేతంచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని హెచ్ కొట్టాల గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరశెట్టి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డే చల్లా తిరుమలేష్(31) మంజుల పుట్టింటికి వెళ్లి ఏడాదైనా తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మంజుల, ఒక కొడుకు, కుమార్తె సంతానం ఉన్నారు. మృతుడి తండ్రి వెంకట్రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సీఐ తిట్టాడని.. మహిళ ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒక సీఐ తనను బూతులు తిట్టడాని మనస్తాపానికి గురై ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు షమీం తెలిపిన వివరాలు.. పట్టణంలోని నడిగడ్డకు చెందిన హుసేన్ తనకు రూ.4లక్షలు ఇవ్వాలని ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో వారు సదరు పో లీస్‌స్టేషన్‌కు పంపించారు. కేసు విషయమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితురాలిని ఆ సీఐ బూతులు తిట్టడాని మనస్తాపం చెంది సెల్ఫీ వీడియో తీసుకొని విషద్రావణం తాగి ఆత్మహత్నాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. బంధువులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈవిషయమై ఆ సీఐని వివరణ అడగగా బాధితురాలి కేసును విచారణ చేస్తున్నామని ఆమెను ఎలాంటి బూతులు తిట్టలేదని స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా సిబ్బంది నడుచుకున్నారని తెలిపారు. రూ.4లక్షలు కూడా ఒక కేసులో ముద్దాయిగా ఉన్న తన భర్త షంపీర్‌ను బయటకు తీసుకురావడానికి హుసేన్‌కు ఇచ్చినట్లు నిర్ధారించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై మండలంలోని కాల్వబుగ్గ గ్రామ బస్టాండు వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లు (36) బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్నాడు. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కిడ్నాప్ కేసు నమోదు

• కారు, సెల్ ఫోన్, డమ్మీ తుపాకీ స్వాధీనం

చాగలమర్రి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తాండ గ్రామానికి చెందిన శివరామనాయక్ అనే వ్యక్తిని మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన చరణ్, యేసయ్య అనే వ్యక్తులు కత్తి, డమ్మీ గన్నుతో బెదిరించి కిడ్నాప్ చేసిన సంఘటనలో ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ సురేష్ చెప్పిన దాని ప్రకారం.. ఎం.తండా గ్రామానికి చెందిన వెంకటేష్ నాయక్‌కు చెందిన 4.6 ఎకరాల పొలాన్ని రూ.25.8 లక్షలకు బేరం చేసి మూడున్నరేళ్ల కిందట రాజునాయక్‌కు విక్రయించాడు. అప్పుడు రాజునాయక్ రూ.20 లక్షలు ఇచ్చి రూ.5.8 లక్షలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టాడు. రెండు నెలల లోపు ఆన్‌లైన్ చేయిస్తే మిగిలిన డబ్బులు ఇస్తానని చెప్పాడు. వెంకటేష్‌నాయక్ మూడున్నర సంవత్సరాలుగా మిగిలిన డబ్బు ఇమ్మని తిరగడంతో రాజునాయక్ ఇవ్వనని, అగ్రిమెంట్ ప్రకారం ఇవ్వనని చెప్పడంతో వెంకటేష్‌నాయక్ పొలంలో విత్తనాలు వేసేందుకు వెళ్లాడు. దీంతో రాజునాయక్, అతడి అక్క ఎం. తాండ సర్పంచ్ శంకరమ్మబాయి, బావ లక్ష్మన్‌నాయక్‌తో కలిసి కిడ్నాప్ కుట్ర పన్నారు. గొడిగనూరు గ్రామానికి చెందిన చరణ్, యేసయ్య అనే వ్యక్తులు వెంకటేష్‌నాయక్ సోదరుడైన శివరామ్‌నాయక్, మరో వ్యక్తి కలిసి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కారులో వెళ్లి శెట్టివీడు గ్రామ సమీపంలో అడ్డుపడి బెదిరించి దాడి చేశారు. ఎవరికైనా చెబితే అంతుచూస్తామన్నారు. అక్కడినుంచి శివరామ్‌నాయక్ తప్పించుకొని పారిపోయి తన సోదరుడు వెంకటేష్‌నాయక్‌కు తెలపడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శివరామ్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్, యేసయ్యలపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిద్దరితో కుట్ర పన్నిన లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ శంకరమ్మబాయి, సోదరుడు రాజునాయక్‌లపై మరో కేసు నమోదు చేశామని అన్నారు. నిందితుడు చరణ్‌కుమార్‌ను చాగలమర్రి కస్తూర్బా పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని కారు, సెల్‌ఫోన్, డమ్మీ తుపాకీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ పేర్కొన్నారు.

కురువలకు ఎస్సీ హోదా ఇవ్వాలి

• కేంద్ర మంత్రికి ఎంపీ బస్తిపాటి నాగరాజు వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కురువ, మాదాసి కురువ కులాలకు ఎస్సీ హోదా కల్పించి, తగిన కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను కోరారు. బుధవారం డిల్లీలో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌ను ఎంపీ కలిసి ఈ మేరకు కలిసి ఓ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కులధృవీకరణ పత్రాల కోసం కురువ సంఘాలు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నాయని, ఎస్సీ హోదా లభించకపోవడంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందడంలో కురువలు ఇబ్బందులు పడుతు న్నారని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

25 క్వింటాళ్ల పత్తి దగ్ధం

• రూ. 2.5 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన పత్తిని చూపుతున్న బాధితులు

గోనెగండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలువాల గ్రామంలో వడ్ల యల్లయ్యకు చెందిన పత్తి పంటకు ప్రమాదవశాత్తు నిప్పుఅంటుకొని దాదాపు 25 క్వింటాళ్ల పత్తి పంట దగ్ధమైంది. రూ.2.50 లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడు వడ్ల ఎల్లయ్య తెలిపిన వివరాలు.. తనకున్న ఏడెకరాల పొలంలో పత్తి సాగు చేశాడు. దాదాపు 25 క్వింటాళ్ల పైగానే పత్తి దిగుబడి వచ్చింది. సీసీఐ అమ్మకం జరిపేందుకుగాను ఈనెల 17న రిజిస్టర్ చేసుకున్నాడు. పత్తి కొంతతేమగా ఉం డటంతో బుధవారం ఉదయం పత్తిని తన ఇంటి ఆరుబయట ఆరవేశాడు. మధ్యాహ్నం వేళ ప్రమాదవశాత్తు ఆరవేసిన పత్తిపై నిప్పురవ్వలు పడ్డాయి. దీన్ని గుర్తించే లోపే మంటలు వ్యాపించి పత్తి దగ్ధమైంది. దీన్ని గమనించిన ఆ ప్రాంతవాసులు మంటలను ఆర్పివేశారు. కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలిపోతుండటంతో రైతు యల్లయ్య బోరున విలపించాడు. దాదాపు రూ. 2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

• 6. 5 తులాల బంగారు ఆభరణాలు అందజేత



బస్సు డ్రైవర్, ఎస్ఐను సన్మానిస్తున్న బాధితులు

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను బాధితురాలికి అందజేసి ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన రామాంజనమ్మ సోమవారం కోడుమూరు వెళ్లే బస్సు ఎక్కింది. వెంకటగిరి గ్రామం నుంచి కోడుమూరుకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో కండెక్టర్ ప్రయాణికులను వెంకటగిరిలో దింపారు. వెంకటగిరి నుంచి ఆటోలో కోడుమూరుకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలో ప్యాలకుర్తికి వెళ్లారు. ప్యాలకుర్తికి వెళ్లిన తరువాత బ్యాగు చూసుకుంటే బంగారు ఆభరణాలు కనపడలేదు. వెంటనే కోడుమూరుకు చేరుకొని బస్సులో వెతికింది. డ్రైవర్, కండక్టర్‌లను అడగగా బస్సులో కనపడలేదని చెప్పారు. రాత్రి డ్యూటీలో డిపోలోకి వెళ్లేటప్పుడు డ్రైవర్ శ్రీనివాసులు నిశితంగా తనిఖీ చేయగా బస్సులో ఒక బాక్సు దొరికింది. అందులో బంగారు ఆభరణాలు ఉండడంతో డిపోలో ఉన్న తనిఖీ అధికారులకు అందజేశారు. డిపో మేనేజరు బుధవారం వెల్దుర్తి ఎస్ఐ నరేశ్‌కు సమాచారం అందజేశారు. బుధవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేయడానికి వెళ్లిన బాధితులు చెప్పిన వివరాలు సరిపోలడంతో ఎస్ఐ నరేశ్, డ్రైవర్ శ్రీనివాసులును పిలిపించి బాధితులకు ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అప్పగించారు. డ్రైవర్ శ్రీనివాసులును, ఎస్ఐ నరేశ్‌ను బాధితులు బుధవారం సాయంత్రం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు.

ఏపీఎస్పీడీసీఎల్‌కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ దీర్ఘకాలికంగా ఇవ్వకుండా సేవాలోపం చేసిన ఏపీఎస్పీడీసీఎల్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. రుద్రవరం మండలం పేరూరులో సత్యనారాయణ స్వామి దేవాలయానికి విద్యుత్ కనెక్షన్ కోసం ఆలయ ధర్మకర్త గంగిశెట్టి రమేష్ 2019లో రూ.10,035ను డిపాజిట్ చేశారు. తర్వాత ఫిర్యాది ఎన్నిమార్లు విన్నవించుకున్నా అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వ లేదు. 2022-23 మధ్యకాలానికి కనెక్షన్ ఇవ్వకుండానే విద్యుత్ బిల్లు జారీ చేశారు. దీంతో ఫిర్యాది వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసును విచారించిన కమిషన్ డిపాజిట్ వసూలు చేసికూడా కనెక్షన్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం సేవాలోపం చేయడమే అవుతుందని నిర్ధారించింది. దీంతో దేవాలయానికి 45 రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్‌ను మంజూరు చేయడమే కాకుండా ఫిర్యాదిదారుడికి మానసిక వేదన కింద రూ.15వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.5వేలను ఫిర్యాదికి చెల్లించాలని కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్. నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

చోళమండలం ఎంఎస్ జనరల్ బీమా కంపెనీకి..

జిల్లాలోని జిల్లెడుబుడకల గ్రామానికి చెందిన బీమాదారుడు లారీ ప్రమాదంలో మృతి చెందినా, కారణాలు చెప్పకుండా ఇన్సూరెన్స్ మొత్తం చెల్లించకపోవడం సేవాలోపం అవుతుందని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్మానించింది. గ్రామానికి చెందిన మృతుడు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ 2023 మే 31వ తేదీ రాత్రి లారీని నడుపుతుండగా.. రోడ్డుపై ఆకస్మాత్తుగా కుక్క దూసుకువచ్చి వాహనం అదుపు తప్పి ఒరిగిపోయింది. ఘటనాస్థలిలోనే డ్రైవర్ మరణించాడు. మృతుడి భార్య చోళమండలం బీమా కంపెనీకి బీమా మొత్తం రూ.15లక్షల కోసం దరఖాస్తు చేసుకుంది. అవసరమైన పత్రాలన్నీ సకాలంలో అందజేసినా కంపెనీ క్లెయిమ్‌ను పరిష్కరించకుండా దీర్ఘకాలికంగా పెండింగ్ ఉంచింది. మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. కేసును విచారించిన కమిషన్ ఫిర్యాది అన్నిపత్రాలు సక్రమంగా దాఖలుచేసినా కూడా బీమా మొత్తం ఇవ్వకపోవడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఫిర్యాదికి బీమా మొత్తం రూ.15లక్షలను 9శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.25వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.5 వేలను 45 రోజుల్లోపు అందజేయాలని కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

భవన యజమానులకు నోటీసులు



ఓ భవనానికి వేసిన బీపీఎస్ ముద్ర

ఎమ్మిగనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించిన భవన యజమానులకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా టీపీవో(టౌన్ ప్లానింగ్ అధికారి) రాజేష్ మాట్లాడుతూ పట్టణంలో 1985 నుంచి ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా గృహాలు, దుకాణాలు, భవనాలు నిర్మిం చిన వారిని గుర్తించాన్నారు. ఇప్పటికే దాదాపు 150మందికి నోటీసులు జారీ చేశామని అన్నారు. అక్రమ కట్టడాలు నిర్మించిన మరి కొంతమందికి నోటీసులు జారీ చేయ నున్నట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు వాటిని బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ద్వారా సక్రమం చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిం చిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారు వెంటనే మున్సిపాలిటీ, సచివాలయం అధికారులను కలిసి బీపీఎస్ ద్వారా సక్రమం చేసుకోవాలని, లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. తొగర్చేడు గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్(37) పదెకరాల భూమి ఉంది. ఐదేళ్ల నుంచి వర్షాలు సరిగ్గా కురవక, అధిక వర్షాలకు పంటలు చేతికి రాక నష్టపోయాడు.

పంటల సాగుకు చేసిన అప్పులు గుదిబండలా మారడంతో దిక్కుతోచక మనస్తాపం చెందాడు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికిభార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు భార్గవి, గౌతమి, కుమారుడు కార్తిక్ ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేటు బ్యాంక్ మేనేజర్‌పై కేసు

ఆళ్లగడ్డ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరిగో ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మేనేజర్ నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగీనా బుధవారం తెలిపారు. ఆమె చెప్పిన వివరాలివీ.. సంస్థలో పని చేసే ఇమ్మానుయేలు అనే ఉద్యోగి ఖాతాదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని వసూలు చేసి సంస్థలో పని చేసే ఫీల్డ్ ఆఫీసర్‌కు ఇచ్చాడు. వారు ఆ సొమ్మును మేనేజర్ నారాయణరెడ్డికి ఇవ్వగా ఈ మొత్తాన్ని సంస్థ ముఖ్య ఖాతాలో జమ చేయ్యకుండా సొంతానికి వాడుకున్నాడు. ఖాతాదారులు చెల్లింపు వివరాలు తెలుసుకోవడంతో అందులో తాము ఇచ్చిన మొత్తం జమ కానట్లు తేలింది. దీనిపై సంస్థ ముఖ్య అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారి ఆదేశాల మేరకు మేనేజర్ నారాయణరెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కోవెలకుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ మహిళ విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కోవెలకుంట్ల పట్టణంలో బుధవారం జరిగింది. బండిఆత్మకూరు గ్రామానికి చెందిన రామేశ్వరమ్మ(51) భర్త పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఉన్నందు వల్ల వారికి ఉన్న పొలం అమ్మి ఒక కూతురుకు వివాహం చేసింది. మరో కూతురును చదివిస్తోంది. ఆర్థిక ఇబ్బందితో బాధపడుతూ ఉండేది. కోవెలకుంట్లలో ఉన్న చెల్లెలు దగ్గరికి వచ్చి మనస్తాపానికి గురై ఆత్మహత్యయత్నం చేసింది. ఆస్పత్రికి తరలించగా వైద్యులు అప్పటికి మృతి చెందిందని తెలిపారు. రామేశ్వరమ్మ కూతురు భావన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ సీఐ మృతి



టక్కీ బాషా(ఫైల్)

కోవెలకుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐగా పని చేస్తున్న టక్కీ బాషా బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఇన్‌చార్జ్ సీఐ సందీప్ తెలిపారు. ఎక్సైంజ్ సీఐగా కోవెలకుంట్లలో పని చేస్తున్న టక్కీ బాషా గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై సెలవు పెట్టి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండేవాడని, కోలుకోలేక మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

మళ్లీ చొరబడేందుకు ప్రయత్నాలు

• సిఫారసు లేఖలతో ప్రత్యక్షమైన దళారులు
• రైతుబజారు సెక్యూరిటీ గార్డులపై దౌర్జన్యం
• దళారులను హెచ్చరించిన పోలీసులు



దళారులను హెచ్చరిస్తున్న మార్కెటింగ్ అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుబజారు నుంచి బయటకు వెళ్లిపోయిన దళారులంతా మళ్లీ చొరబడేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేలతో సిఫారసు లేఖలను రాయించుకుని వచ్చి సి.క్యాంపు రైతుబజారులో మళ్లీ తమకు చోటు కల్పించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. మా స్థానంలో కూర్చున్న రైతులను బయటకు పంపాలని రైతుబజార్ ఎస్టేట్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో వారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే ఇచ్చిన సిఫారసు లెటరుతో ఓదళారి వచ్చి రైతును బయటకు పంపి తనకు చోటును కల్పించాలని ఎస్టేట్ అధికారితో వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారంలో ఆ దళారి ఓ సెక్యూరిటీ గార్డుపై దౌర్జన్యానికి దిగారు. మరో దారి లేక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శేషయ్యకు ఫిర్యాదు చేశామని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ విలేకరులకు తెలిపారు. సీఐ ఆదేశాలతో రైతుబజారుకు వచ్చిన పోలీసులు దళారులను హెచ్చరించి రైతులకు ధైర్యం చెప్పారు. రైతుబజారులో మొదటి ప్రాధాన్యం రైతులకే కల్పించాలని, తర్వాత పొదుపులక్ష్మి మహిళలు, మిగిలినవారికి చోటు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు తెలిప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు కూడా రైతుల పక్షాన నిలబడితే బాగుంటుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఆర్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్డీవో విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రతి పనికో రేటు' కథనం ప్రచురితమైంది. దాంతో పట్టణంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తే సహించేది లేదన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యులు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

నిధులు మంజూరు చేయాలి


జలవనరులశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే బుడ్డా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పెండింగ్ ప్రాజెక్ట్ పురోగతి అంశాల గురించి చర్చించారు.

సదస్సును జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న సంస్థ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిరంజన్

ఆత్మకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమంలో భాగంగా ఈ నెల 14న కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో చర్చా సదస్సును జయప్రదం చేయాలని బాంసెఫ్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిరంజన్ కోరారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. సదస్సులో 75ఏళ్ల నుంచి బీసీల కోసం రాయబడిన 340 ఆర్టికల్ అమలు కాకపోవడానికి గల కారణాలను, బీసీల అభివృద్ధి, 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు, ఈవీఎంలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆయా సంఘాల నాయకులు డాక్టర్ నాగన్న, రఘురాముడు, వెంకటస్వామిగౌడ్, బాలస్వామి యాదవ్, రామకృష్ణ, వీరన్న, వెంకటరమణ, నరసింహులు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

వ్యవసాయ కార్మికులకు రక్షణ కల్పించాలి


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని ఏపీ వ్యసకా (ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక) సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు మున్సిపాలిటీ జై కిసాన్ పార్కులో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలు కొంగర వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు రెక్కల కష్టం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. సరైన వేతనాలు అందకపోగా దుర్భరమైన జీవితం గడుపుతున్నారన్నారు. ప్రమాదంలో మరణిస్తే కుటుంబాలకు ఎలాంటి భరోసా లేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్ర చట్టం చేసి వాటి ద్వారా వ్యవసాయ కార్మికులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయా ప్రమాదాల్లో మృతి చెందితే కార్మికులకు ఎక్స్‌గ్రేషియా సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాష, మహిళా సంఘం కార్యదర్శి సాజిదాబి, తదితరులు పాల్గొన్నారు.

17న క్యాండిల్ లైటింగ్ సర్వీస్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

ఆత్మకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెల 17న ఆల్ డినామినేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డులో క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శీలం శేషు తెలిపారు. బుధవారం స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్య ప్రసంగికులుగా బిషప్ సత్యప్రకాష్ హాజరై వాక్యోపదేశం చేయనున్నట్లు తెలిపారు. అతిథులుగా ఈటె స్వామి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు రానున్నట్లు చెప్పారు. క్రైస్తవులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, భూపాల్‌రెడ్డి, బద్రునాయక్, సురేష్, చెన్నయ్య, అశోక్, సుధాకర్, సాల్మన్, ఇమ్మానుయేలు, ఓబులేసు తదితరులున్నారు.

రైతు సమస్యలపై ఉద్యమిస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య
- మార్కెట్ యార్డు నుంచి ర్యాలీ
- డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేత


డీటీకి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హెచ్చరించారు. గురువారం రైతుల సమస్యలు పరిష్కరించాలని మార్కెట్‌యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు రామసంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు దరలు లేక రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పంటల నష్టం తక్కువగా చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టమోటా, అరటి రైతులను ఆదుకోవాలని కోరారు. డోన్‌లో ప్రభుత్వం జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ద్వంద వైఖరి అవలంబిస్తున్నారన్నారు. వేలాది ఎకరాల భూములను పరిశ్రమల పేరిట కార్పొరేట్లకు అంటగడుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, సోమన్న, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవి, భాస్కర్, సుంకయ్య పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ
- ఘనంగా మానవ హక్కుల దినోత్సవం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ

శ్రీశైలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. పద్మ సూచించారు. బుధవారం రాజనీతిశాస్త్రం, ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని సున్నిపెంట ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ పౌరసత్వంతో పాటు తమకు ఉండే హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పలువురు మానవ హక్కుల గురించి వివరించారు. సమావేశంలో ఎన్‌ఎస్ఎస్ అధికారి బుచ్చయ్య, డాక్టర్ రాజన్న, ఎస్. మహేశ్వర్‌రెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, షాహెదా, కిరణ్‌కుమార్, మీనాక్షి పాల్గొన్నారు.

హక్కులు లేని మనిషి బానిసతో సమానం

నందికొట్కూరు: హక్కులేని మనిషి బానిసతో సమానమని సామాజిక కార్యకర్త శోభారాణి అన్నారు. బుధవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామాచార్యుల అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సామాజిక కార్యకర్త శోభారాణి మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడి బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం ద్వారా లింగ సమానతను సాధించవచ్చన్నారు. ప్రపంచంలో ప్రతి వ్యక్తి వివక్షలేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న పారిస్‌లో సభ్య దేశాలంతా ఓ కీలక ఒప్పందంపై సంతకం చేసినట్లు ఆమె గుర్తు చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్ బాబు మాట్లాడుతూ మానవహక్కుల గురించి తెలుసుకోవడమే కాదు, వాటిని సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. హక్కుల గురించి తెలుసుకుంటేనే అన్యాయాన్ని ప్రశ్నించే తత్వం అలవడుతుందన్నారు. సమావేశంలో అధ్యాపకులు చంద్రహాస్, కోర్టు సిబ్బంది మనోహర్ పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ విధానాలను పాటించాలి


మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ధనలక్ష్మి

ఆత్మకూరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ విధానాలను పాటించి సాగులో అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని నల్లకాలువ గ్రామంలో సుస్థిర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుని భూసార ఆధారిత ఎరువులు వాడాలని సూచించారు. పచ్చి రొట్ట పైర్లు, పంట మార్పిడితో నేల సారవంతం పెంచుకోవాలన్నారు. అలాగే సుస్థిర వ్యవసాయ విధానాలైన నవధాన్యాల సాగు, పంట అవశేషాలు కలియదున్నడం, జీవన ఎరువులు జీవ క్రిమినాసినులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బాలరాజు, రవిగౌడ్, ఆత్మకూరు వ్యవసాయాధికారి హేమలత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొరపాట్లు పునరావృతం కాకూడదు


తనిఖీలో పాల్గొన్న అధికారులు

వెలుగోడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎన్ఎస్ఎస్‌వో కడప ఆర్‌జేడీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఎన్ఎస్ఎస్‌వో సెంట్రల్ కమిటీ, అగ్రికల్చర్, ప్లానింగ్ శాఖల ఉన్నతాధికారులు బుధవారం మండలంలోని గుంతకందాల గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్, క్షేత్రస్థాయిలో సాగుచేసిన పంటలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌వో అమృత, కర్నూలు ఎన్ఎస్‌వో అధికారులు, ఏవో వెంకటేశ్వరరెడ్డి, నంద్యాల డిప్యూటీ ఎస్‌వో ప్రసాదరరెడ్డి, డీఎస్‌వో నాగరాజు, ఏఎస్‌వో బాలలక్ష్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశం ప్రపంచానికి ఆదర్శం


మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

శ్రీశైలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం ప్రపంచానికి ఆదర్శమని అఖిల భారత సామరస్యత వేదిక కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీశైలం లోని ఎంపీ థియేటర్‌లో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. పలు ధార్మిక సంఘాల వక్తలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రలోభాలకు గురి చేస్తూ మతమార్పిడీలను ప్రోత్సహించే వారిని తిరస్కరిస్తున్న హిందువులు గర్వకారణమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకంగా అభివృద్ధి చెందుతున్న రోజుల్లో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు సంప్రదాయాలను ఆచరించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మౌనస్వామి ఆశ్రమం శివ స్వామి, యోగినిమాతా ఆశ్రమం రాజు స్వామి, అడ్వకేట్ గిరిధర్, అరవింద్, చెన్నకేశవులు, సుగుణ, శ్రీనివాస్, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవే టీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రతులను జిల్లా కేంద్రానికి పంపించారు. ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా శ్రీశైల నియోజకవర్గం నుంచి 63వేల సంతకాలను సేకరించినట్లు తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని, లేని పక్షంలో వైసీపీ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, తిరుపమరెడ్డి, అంజాద్‌అలి, జయకృష్ణ, మారుబత్తుల విజయకుమార్ తదితరులున్నారు.

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం చేపట్టిన పీపీపీ విధానానికి వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను జిల్లా కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు వైసీపీ సమన్వయకర్త డా.ధార సుధీర్ తెలిపారు. బుధవారం పటేల్ సెంటర్‌లో వైసీపీ సేకరించిన కోటి సంతకాల ప్రతులను తరలించే వాహనానికి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు హర్షించడం లేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండలాల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: కోటి సంతకాల ప్రతులను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా


నందికొట్కూరు: జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ధార సుధీర్

వలసల నివారణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మేరీ

కొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉపాధి, వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా నివారించేందుకు ప్రతి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో మేరీ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో విమలమ్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో వలసలు నివారించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏ గ్రామంలోనైనా వలసలు ఎక్కువ ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పనులు కల్పించేందుకు ముందస్తు పనుల గుర్తింపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఇందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మహానంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో గుడిసె కాలిపోయిన బాధితుడు నాసరి రాజు కుటుంబానికి టీడీపీ నాయకురాలు మూలస్థానం ఉమాదేవి నిత్యావసర సరుకులు అందజేశారు. బుధవారం మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. తనవంతు సహాయంగా నిత్యావసర సరుకులతో పాటు వస్త్రాలను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడి పక్క గృహం నిర్మాణానికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీకే స్వామిరెడ్డి, పద్మజ, పటాల శ్రీను, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న అధ్యాపకులు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కౌశల్ 2025 సైన్స్ ప్రతిభా పాఠవాల రాష్ట్రస్థాయి పోటీలకు దామగట్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని కలువల లక్ష్మి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అనితాజీవన్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి డీఈవో జనార్దన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, డిప్యూటీ డీఈవో శంకర్‌ప్రసాద్ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుందన్నారు. ఈ నెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు

- ఏఈ నారాయణరెడ్డి

కొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.3.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంగమేశ్వరం, శివపురం, గుమ్మడాపురం ఎత్తిపోతల పథకాల మోటార్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో చర్చించి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తి స్థాయిలో పనులు చేపట్టి రైతులకు ఇబ్బందులు కలగకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని వెల్లడించారు.

వ్యవసాయ ఆధునికీకరణపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌలూరులో ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ ఎస్-2 ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ ఆధునీకరణపై అవగాహన కల్పించారు. స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవరోజు బుధవారం విద్యార్థులు వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు, డ్రోన్లు, పరికరాలతో వ్యయం తగ్గింపు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యప్రకాష్, అధ్యాపకులు పీవీ గోపీకృష్ణారావు, ఏఈఓ పర్వానా, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు ఐదెకరాల స్థలం


పిన్నాపురంలో పాఠశాలకు కేటాయించిన స్థలం

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నాపురం జడ్పీ పాఠశాలకు ఐదెకరాల స్థలాన్ని ప్రతిపాదించినట్లు తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. సర్వేనెంబరు 404, ఎల్‌పీఎం 341 నెంబరులోని స్థలాన్ని ఎంపిక చేసి నివేదికలు కలెక్టరేట్‌కు పంపామన్నారు. అలాగే కౌలూరు పరిధిలోని 126 సర్వే నెంబరులోని వక్ఫ్‌బోర్డు స్థలాన్ని జిల్లా కోర్టుల సముదాయానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు.

సాంకేతికతపై అవగాహన ఉండాలి


విద్యార్థులతో శాస్త్రవేత్త డాక్టర్ అల్లు అమర్‌నాథ్ రెడ్డి

పాణ్యం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన ఉండాలని శాస్త్రవేత్త డాక్టర్ అల్లు అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శాస్త్రసాంకేతిక రంగాలలో పరిశోధన అనే అంశంపై అవగాహన కల్పించారు. నేటి శాస్త్రసాంకేతిక విధానాలు, ప్రయోజనాలు, దేశానికి సాంకేతిక అవసరాలు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములునాయక్, ఉపాధ్యాయులు పుల్లయ్య, శివశంకర రెడ్డి, ప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


పోటీలను ప్రారంభిస్తున్న బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్‌బాషా

నందికొట్కూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఆసిఫ్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాపోటీలను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి ప్రారంభించారు. ఆత్మకూరు, నంద్యాల, కర్నూలు, నందికొట్కూరు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ముగ్గురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యారని ఆసిఫ్‌బాషా తెలిపారు.

పొలాల్లో వ్యర్థాలను కాల్చరాదు


బుక్కాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో నాగేశ్వరరెడ్డి

మహానంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట కోతల తర్వాత వ్యర్థాలను రైతులు కాల్చడం ద్వారా భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా, కలియదున్నడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు సరేంద్రనాథ్‌రెడ్డి, మోహన్‌రావు, గ్రామ ఉద్యానవన అధికారులు శిరీష, సుభాష్ చంద్రబోస్, అరటి ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కలగా 30 పడకల ఆసుపత్రి

- పాలకుల హామీలు నీటి మూటలు
- ఇబ్బందుల్లో రోగులు

ప్యాపిలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు ప్రజలకు కలగా మారింది. దశాబ్దాల నుంచి ఆసుపత్రి స్థాయి పెంచుతామని చెబుతున్న పాలకుల హామీలు నీటి మూటలవుతున్నాయి. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయి. పట్టణంలో 10 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. అయితే రోజు రోజుకు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న కారణంగా ప్రస్తు తం ఉన్న పడకలు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో రోగులు ఇబ్బం దులకు గురవుతున్నారు. ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచుతామన్న పాలకుల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ప్యాపి లిలో 44వ జాతీయ రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతుంటాయి. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుంటారు. అయితే ఇక్కడ సరిపడ పడకలు లేదనందున బాధితులకు వైద్యం చేయడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైన పాలకులు స్పందించి ప్యాపిలి ఆసుపత్రి స్థాయి పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అధికారులపై ఎమ్మెల్యే కోట్ల ఆగ్రహం

డోన్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో డోన్ నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయ డంలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీవో కేవీ నరసింహులు, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సి పల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్లు రవికుమార్, నాగమణి, పంచాయతీ రాజ్ డీఈ గంగాధర్, ఏఈ నారాయణ, ఎంఈవో ప్రభాకర్ పాల్గొన్నారు.

- పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కోట్ల బుధవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు.
- బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రం ఈవో రామాంజనేయులు, దేవదాయ శాఖ సూపరింటెండెంట్ సతీష్‌లు బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ అభివృద్ధి పురోగతిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ


ఎన్‌సీసీ కేడెట్‌లకు సూచనలిస్తున్న కమాండర్ అలోక్ త్రిపాఠి

శిరివెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ అని కర్నూలు బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ గ్రూపు కమాం డర్ అలోక్ త్రిపాఠి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థులు ఉన్నత విలువలు నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో 28-ఏ బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీసర్ శశికుమార్, కళాశాల వైస్ ప్రిన్సి పాల్ జనార్ధనుడు, ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ ఖాసీం సాహెబ్, అధ్యాప కులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సీసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి 28(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠీ, సీఓ శశికుమార్ హాజరై మాట్లాడారు. సీటీఓ నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

బనగానపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సరళమ్మ, ఏడీఏ చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎర్రగుడి, పలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయం చేసి భూమి ఆరోగ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చాగలమర్రి: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మల్లేవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధిక ఎరువుల వాడకంతో కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసులు

రుద్రవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తామని ఏపీ ఎంఐపీ జిల్లా ప్రాజక్టు అధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడితో భూమిలో సారవంతం పెరిగి పంటలు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పాం మొక్కలను పెంచాలని సూచిం చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుమతి, ఏఈవోలు రాజు, తబుస్సుం, వీఏఏలు సాల్మన్ ఫణిరాజశేఖర్ పాల్గొన్నారు.

తెగుళ్లతో దెబ్బతిన్న తోటల పరిశీలన


దెబ్బతిన్న జాజి తోటను పరిశీలిస్తున్న వీహెచ్ఏ దివ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో తెగుళ్లతో దెబ్బతిన్న మల్లె, జాజిపూల తోటలను వీహెచ్‌వే దివ్య పరిశీలించారు. 'తెగులు.. దిగులు' అనే శీర్షిక బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. జిల్లా ఉద్యానశాఖ అధికారి స్పందించి ఆయన ఆదేశాల మేరకు తోటలను పరిశీలించారు. దెబ్బతిన్న తోటల వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న జాజిపూల చెట్ల వివరాలను రైతు షబ్బీర్‌ను అడిగి తెలుసుకున్నారు. 50 చెట్ల దాక దెబ్బతిని నష్టపోయానని రైతు వాపోయాడు.

మాటామంతిపై సమీక్ష

చాగలమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఎంపీఈవో కార్యాలయంలో బుధవారం మాటామంతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. మాటమంతి గురించి వెబ్‌సైట్ ద్వారా రాష్ట్ర కమిషనర్ తెలియజేశారు. ఆరోగ్యం, ఆత్మీయం, తెలుగులో మాట్లాడుకోవడం, చర్చించుకోవడం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, డిప్యూటీ ఎంపీడీవో తారకేశ్వరి, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


ఉయ్యాలవాడలో తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న వీఆర్ఏలు

ఉయ్యాలవాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు నాగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం ఇచ్చారు. నాగేష్ మాట్లాడుతూ ఈనెల 16న వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని మంగళగిరిలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. వీఆర్ ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏలు అల్లాబకాష్, బాలుడు, దాదాసాహేబ్, బడేసాబ్, మధు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో పనిచేస్తున్న వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు దానం, అధ్యక్షులు హుసేన్‌బాషా, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు దోనీ ఆల్‌ఫ్రెడ్‌కు వినతిపత్రం అందజేశారు.

మానవ హక్కులను కాపాడుకుందాం

- జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్
- ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ఆళ్లగడ్డ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను కాపాడుకుందామని జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్ పాల్గొని ప్రసంగించారు. నేరం చేసిన వ్యక్తులకు శిక్షించడం, సంకెళ్లు వేయడం వంటి అధికారం పోలీసులకు లేదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి, ప్యానల్ న్యాయవాదులు సుబ్బయ్య, మోహన్, మున్సిపల్ మేనేజర్ అనంద్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

బనగానపల్లె: ప్రతిపౌరుని హక్కులను కాపాడేది రాజ్యాంగమని బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మానవహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ దుగ్గి రెడ్డి, న్యాయవాదులు రఘురామిరెడ్డి, అజాంహుసేన్, అల్లావుద్దీన్, అజీహిర్, ప్రిన్సిపాల్ రాజిక ప్రపూర్ణ, అధ్యాపకులు ఆనంద్, కిశోర్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: బాలల హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఓబులమ్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి 1948, డిసెంబరు 10న విశ్వ మానవ హక్కుల ప్రకటనను యుఎన్ఓ జనరల్ అసెంబ్లీ సమావేశంలో తీర్మానించిందని, తర్వాత 1950 లో జరిగిన ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ప్రతి సంవత్సరం డిసెంబరు 10ని మానవ హక్కుల దినంగా పాటించాలని తీర్మానించిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు వెంకటేశ్వర రెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు పి సంటిరెడ్డి, కళాశాల ఐక్యూఏసి కో ఆర్డినేటర్ ఈయు భాస్కర రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మానవ హక్కులను కాపాడుకుందామని డీఐఈవో (జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి) శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్ పాటి, రామక్రిష్ణ, ఓబులేసు, మద్దిలేటి, ముస్తాక్ పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్


బనగానపల్లెలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ


కోవెలకుంట్ల, ప్యాపిలిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్, డీఐఈవో శంకర్‌నాయక్

వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలి


సంజామలలో మాట్లాడుతున్న అధికారి మాధవీ లత

ఉయ్యాలవాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వంద రోజుల ప్రణాళికను పక్కగా అమలు చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవీ లత అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ జగన్ మోహన్‌రెడ్డి, అలెస్కో ప్రసన్న, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, హెచ్‌యం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంజామల: ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికతో బోధించాలని సమగ్ర శిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవిలత అన్నారు. బుధవారం ఆమె పేరుసోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో మాట్లాడారు. జిల్లా కోఆర్డినేటర్లు జగన్ మోహన్ రెడ్డి, ప్రసన్న కుమా ర్, ఎంఈవో రమణా రెడ్డి, సీఆర్‌పీ హుసేన్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 నుంచి చండీయాగం

బనగనపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఈనెల 16, 17, 18 తేదీల్లో చండీయాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పీవీ.నాగార్జునరెడ్డి బుధవారం తెలిపారు. 18న పూర్ణాహుతినిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం చౌడేశ్వరీమాత దీక్ష చేపట్టిన వారు దీక్షలను విరమించనున్నట్లు తెలిపారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొంటారన్నారు. భక్తులు చండీ యాగంలో పాల్గొనాలని చైర్మన్ కోరారు.

విద్యుత్ కార్యాలయం తనిఖీ

డోన్ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కార్యాలయాన్ని ఆ శాఖ ఎస్ఈ సుధాకర్ బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో డివిజన్‌లోని విద్యుత్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమలాకర్, డిప్యూటీ ఈఈ మధుసూదన్ రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

15న హిందూ సమ్మేళనం

కోవెలకుంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 15న హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఆచార్య అభినవ శంకరానంద స్వామిజీ, ప్రధాన వక్తగా విభాగ్ ఘోష్ ప్రముఖ్ పరశురాముని రామకృష్ణ హాజరవుతున్నారని తెలిపారు.

ముళ్లకంప తొలగింపు

శిరివెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనికెందిన్నె గ్రామ పరిధిలో పంట పొలాల ఆయకట్టు రహదారుల వెంట ఉన్న ముళ్లకంపను ఎక్స్‌కవేటర్‌తో టీడీపీ నాయకుడు మురళీ తన సొంత నిధులు వెచ్చించి తొలగించారు. అలాగే డోజర్‌తో రహదారిని చదును చేయించాడు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు మురళికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ర్యాలీ

డోన్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డోన్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను ప్రత్యేక వాహనంలో జిల్లా వైసీపీ కార్యాలయానికి పంపారు. కార్యక్రమంలో డోన్ వైసీపీ నాయకులు ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, వైసీపీ వలంటరీ విభాగపు జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, పార్టీ పట్టణ మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జున రెడ్డి, నాయకులు మున్సి పల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్ పాల్గొన్నారు.

బనగానపల్లె: మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా బనగానపల్లె నియోజకవర్గంలో వివిధ వర్గాలనుంచి సంతకాలను సేకరించి వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తదితర వైసీపీ శ్రేణులతో కలసి ప్రత్యేక వాహనంలో పంపించారు. పార్టీ పిలుపు మేరకు బనగానపల్లె వైసీపీ కార్యాలయం నుంచి జెండా ఊపి వాహనంలో ప్రజలనుంచి సేకరించిన సంతకాల ప్రతులను పంపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ మానసవీణ, బనగానపల్లె మండల వైసీపీ అధ్యక్షుడు సన్నల జనార్దన్‌రెడ్డి, గుండం సూర్యప్రకా శ్‌రెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయవద్దని వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను ప్రత్యేక వాహనం డోన్ నుంచి బేతంచర్ల చేరుకోవడంతో వైసీపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలం రెడ్డి, మండల వైసీపీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రా రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తుజావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.


సంతకాల ప్రతులను వైసీపీ జిల్లా కార్యాలయానికి పంపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బాల్య వివాహాలు నేరం : సీడీపీవో

చాగలమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఆళ్లగడ్డ సీడీపీవో తేజశ్వరి అన్నారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో తాహిర్‌హుసేన్, హెచ్ఈ విజయభారతి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఐసీడీఎస్ అధికారి జగ్గయ్య, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీగా భాగ్యనగరం


మాట్లాడుతున్న టీడీపీ మండల సెక్రెటరీ సురేంద్ర

దొర్నిపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగరం గ్రామం నూతన గ్రామ పంచాయతీగా తీర్మానం చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. బుధవారం భాగ్యనగరం గ్రామంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్, సర్పంచ్ మాధవిలత ఆధ్వర్యంలో గ్రామస్థుల తీర్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భాగ్యనగ రం గ్రామం కొండాపురం గ్రామ పంచాయతీలో ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగ్యనగరాన్ని గ్రామ పంచాయతీగా చేయాలని జీవో రావడంతో ఆ మేరకు గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో గ్రామ పంచాయతీగా ఆమోదించారని అన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారు లకు నివేదించామన్నారు. మండల టీడీపీ సెక్రెటరీ కొత్తపల్లి సురేంద్ర, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి రమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి ఉసేని, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

- **గ్రామాభివృద్ధికి ముందడుగు:** భాగ్యనగరం నూతనంగా గ్రామ పంచాయతీగా ఏర్పడటంతో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని దొర్నిపాడు మండల టీడీపీ మండల సెక్రెటరీ కొత్తపల్లి సురేంద్ర, రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నేటికి ప్రజల కల నెరవేరిందన్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ అనుప్రియ

ఆళ్లగడ్డ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రుతుక్రమ పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ టీఎంసీ అనుప్రియ అన్నారు. బుధవారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నంద్యాలకు చెందిన డాక్టర్ అనుప్రియ హాజరైన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ చార్టెడ్ అధ్యక్షురాలు టీఎంసీ గాయత్రి దేవి, హెచ్‌ఎం పర్హత్ నసీం, రోటరీ క్లబ్ జిల్లా ఆఫీసర్ టిఎంసీ వేణుగోపాల్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి ఉమామహేశ్వరి, సభ్యులు రమాబాయి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, విజయగీత, స్వర్ణ, శ్రీదేవి, లావణ్య పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించడం అన్యాయం: సీపీఎం

డోన్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజోతి): పట్టణంలోని గుత్తి రోడ్డులో 503 సర్వే.నెంబరులో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అన్యాయమని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. బుధవారం డోన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి రిలే దీక్షలను చేపట్టారు. నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ పేద కుటుం బాలు గుడిసెలు వేసుకుని జీవనం చేస్తుంటే రెవెన్యూ, పోలీసులు, మున్సి పల్ అధికారులు గుడిసెలను కూల్చేశారని, దీంతో వారి పరిస్థితి దయ నీయంగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు రామాంజనేయులు, మాణిక్యం శెట్టి, చిన్న రెహిమాన్, శివరాం, భాస్కర్ రెడ్డి, ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో సీఐ రమేష్‌బాబు బుధవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పత్రాలు సరిగాలేని వాహనాలు గుర్తించి, అపరాధ రుసుం విధించారు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉండాలని అన్నారు.